Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143








Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 107 | Thursday 27.03.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 107 | గురువారం 27. 03. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4


### హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడలేను..

## నేను తెలుగు బిడ్డను

### : మంత్రి సీతక్క

**తెలుగు రాష్ట్రంలో ఎక్కడో గూడెంలో పుట్టానన్న సీతక్క**
**తనకు హిందీ, ఇంగ్లీష్ రాదని చెప్పడం సరికాదన్న సీతక్క**
**అక్బరుద్దీన్ ఒవైసీని ఉద్దేశించి మంత్రి సీతక్క వ్యాఖ్యలు**



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : "నేను తెలుగు గడ్డ మీద పుట్టాను. నా మాతృభాష తెలుగు. అందుకే నేను హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడలేను. నేను తెలుగు వ్యక్తిని" అని తెలంగాణ మంత్రి సీతక్క శాసనసభలో అన్నారు. మజ్లిస్ పార్టీ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు హిందీ, ఇంగ్లీష్ రాదని చెబుతున్నారని, కానీ తాను తెలుగు రాష్ట్రంలో ఎక్కడో గూడెంలో పుట్టానని ఆమె అన్నారు.

**పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఆమోదం**

పంచాయతీరాజ్ సవరణ బిల్లును తెలంగాణ శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. పంచాయతీరాజ్ సవరణ మిగతా 2 లో

### చంద్రబాబుకు మెసేజ్ చేసినా...

## రెస్పాన్స్ రాలేదు

### : కేఏ పాల్



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : రాజమండ్రి శివార్లలో జరిగిన ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహానికి రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మరోవైపు ఆసుపత్రి వద్దకు చేరుకున్న కేఏ పాల్ పోస్టుమార్టం జరుగుతున్న మార్చురీ వద్దకు వెళ్లారు. పోస్టుమార్టం ప్రక్రియను తాను కూడా పరిశీలిస్తానని చెప్పారు. అయితే, పోస్టుమార్టం గదిలోకి అనుమతించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ... ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ మృతిపై అనుమానాలు ఉన్నాయని మిగతా 2 లో





### కొత్త జిల్లాలలో ఎటువంటి స్టాఫ్ సమస్య లేకుండా ....

# చూసుకోవాలి

### వారికి పూర్తి స్థాయి అధికారాలు ఇవ్వండి.. సీఎం ఆదేశాలు

### జపాన్ ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం


అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : రాష్ట్ర సచివాలయంలో రెండవ రోజు కలెక్టర్ల సమావేశం జరుగుతోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలలోని అధికారులతో సంబంధం లేకుండా కొత్త జిల్లాలో జిల్లా అధికారులకు పూర్తిస్థాయిలో అధికారాలు డెలిగేట్ చేయాలని ఆదేశించారు. ఆయా జిల్లాలోని అధికారులు స్వేచ్ఛగా వారి విధులను నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్నారు. దీనిపై సంబంధించిన ఆదేశాలను హెచ్ఓడీలు రెండు రోజుల్లో జారీ చేయాలని తెలిపారు. కొత్త జిల్లాలలో ఎటువంటి స్టాఫ్ సమస్య లేకుండా స్టాఫ్ రెగ్యులేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పని ఒత్తిడికి తగ్గట్టుగా అధికారులు, సిబ్బందిని కేటాయించాలని వెల్లడించారు. ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లోనూ ప్రత్యేకించి కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్లలో కనీసం మూడు హొటల్స్ ఉండేలా చూడాలన్నారు. కొత్త జిల్లాల్లో మౌలిక వసతుల కల్పన అంశంపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై రాష్ట్రస్థాయిలో చర్చిస్తున్నామని సీఎం అన్నారు. పేదరిక నిర్మూలనకు సంపదను సృష్టించే టూరిజం తదితర అంశాలకే భవిష్యత్తు అంతా ప్రాధాన్యతనిస్తుందని, భౌతిక వాదమే వస్తుందని అన్నానని.. కాబట్టి తాను చెప్పేదంతా జిల్లా కలెక్టర్లు అందరూ అర్థం చేస్తుకుని క్షేత్ర స్థాయిలో రియల్ టైమ్‌లో అమలుపరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. ఏపీలో ఐదు జోన్‌లు ఉన్నాయన్నారు. జోన్-1 లో విశాఖపట్నం, జోన్-2 లో రాజమండ్రి, జోన్-3 లో రాజదాని అమరావతి, జోన్-4 లో తిరుపతి, జోన్-5 లో అనంతపురం పవర్ హబ్‌లుగా ఉన్నాయని తెలిపారు. ఆ పవర్ హబ్ల ఆధారంగా ఆయా జోన్లలోని అన్ని జిల్లాలను అభివృద్ధి పర్చే విధంగా జిల్లా కలెక్టర్లు జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలుపరిస్తే రాష్ట్ర భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందని వెల్లడించారు. ప్రతి ఒక్క జోన్‌కు ఒక సీనియర్ అధికారిని ఇన్‌చార్జిగా ఉంచామన్నారు. ప్రతి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి కూడా ఉన్నారని తెలిపారు. వీరందరూ కలిసి ఆయన జిల్లాలను, ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో సమగ్రంగా చర్చించి క్షేత్ర స్థాయిలో తగు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారుర. గ్రామాల్లోని వాస్తవ విషయాలను తెలుసుకుని అందుకు తగ్గట్టుగా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే విధంగా, గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని మిగతా 2 లో

### సభ నడిపే పద్ధతి...

## ఇది కాదు..

### స్పీకర్ ఓం బిర్లాపై రాహుల్‌గాంధీ కామెంట్స్

న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ స్పీకర్ ఓం బిర్లా తీరుపై మండిపడ్డారు. స్పీకర్ సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదని, ఇది అప్రజాస్వామికమని వ్యాఖ్యానించారు. సభలో ఏం జరుగుతుంతో తనకు అర్థం కావడంలేదని, ఎన్నిసార్లు అభ్యర్థించినా స్పీకర్ తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని ఆరోపించారు. బుధవారం సరైన కారణం లేకుండా స్పీకర్ సభను వాయిదా వేశారని మిగతా 2 లో



### తల్లిదండ్రులే...

## నాకు స్ఫూర్తి



**పేదరికం లేని సమాజమే సీఎం చంద్రబాబు లక్ష్యం**

**టెక్నాలజీని విధ్వంసానికి వాడకండి**

**దేవాన్ష్ లాగే తక్కువ స్క్రీన్ టైమింగ్ పాటించండి**

**సైన్స్ అండ్ టెక్నాలజీలతో భారత్ గ్లోబల్ లీడర్ గా ఎదగాలి**

**అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ విద్యార్థులతో నారా భువనేశ్వరి**

కుప్పం, **చిత్తూరు ఎక్స్ ప్రెస్,** మార్చి26: ప్రతి ఒక్కరికి అందుబాటులోకి వస్తున్న టెక్నాలజీని వ్యక్తిత్వ వికాసానికి వాడుకోవాలే గానీ విధ్వంసానికి కాదని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీని వాడుకోవడం తెలియక కొంతమంది యువత దుర్వినియోగం చేస్తోందని, ఇది వారి భవిష్యత్తును కాలరాస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లను ఎంతమేరకు వాడుకోవాలో అందరూ తెలుసుకోవాలని అన్నారు. కుప్పంలోని అగస్త్య మిగతా 2 లో



### ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు...

## ఇస్తాం : మంత్రి

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : దీపం-2 పథకం లో భాగంగా తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ మార్చి 31 వరకే అవకాశం ఉందని ఇప్పటి వరకు పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలని ఆహార పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ప్రతి పేద ఆడబిడ్డకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామన్న హామీ మేరకు కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఇప్పటి వరకు 98 లక్షల మంది తొలి ఉచిత గ్యాస్ సిలిండర్స్ వినియోగించుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఏపీలో సూపర్ సిక్స్ హామీని కూటమి సర్కార్ నిలబెట్టుకుంటోందన్నారు. ఉచిత సిలిండర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము మిగతా 2 లో



### మాజీ మంత్రి...

## కొడాలి నానికి అస్వస్థత

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : వైసీపీ కీలక నేత , మాజీ మంత్రి కొడాలి నాని అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చేరారు. గత రాత్రి మంగళవారం ఆయనకు గ్యాస్ట్రిక్ సమస్య తలెత్తడంతో ఆస్పత్రిలో చేరారు. అయితే ఆయనకు గుండె సంబంధిత సమస్య ఉందని గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే వైద్యులు కొన్ని పరీక్షలు పూర్తి చేశారు. బుధవారం మిగతా 2 లో



# సంపాదకీయం

## పదేళ్లలో ఇండియా జీడీపీ డబుల్

భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతోంది. గతంతో పోలిస్తే ఆర్థిక వృద్ధి గాడిలో పడింది. కాస్త మందగమనం ఉన్నప్పటికీ.. అనేక విషయాల్లో భారత ఆర్థిక వ్యవస్థ ముందంజలోనే ఉంది. ఈ క్రమంలో ఈజ25లో భారతదేశ జీడీపీ వృద్ధి గత 10 సంవత్సరాలలో రెట్టింపు అయింది. 2015లో 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి 4.3 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేయడం జరిగింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి విడుదల చేసిన డేటాలో ఈ సమాచారం ఇచ్చారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడం వల్ల, భారతదేశ జీడీపీ 2025లో జపాన్, 2027లో జర్మనీ కంటే ముందు వరుసలో నిలవనుంది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. ఇది విధాన సంస్కరణలు, బలమైన ఆర్థిక వృద్ధి కారణంగా పేర్కొంది. 10 సంవత్సరాలలో భారతదేశం తన స్థూల దేశీయోత్పత్తిని రెట్టింపు చేసి 105 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఐఎంఎఫ్ డేటా తెలిపింది. 2015లో 2.1 ట్రిలియన్ డాటర్ల నుండి 2025లో 4.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. గతంలో పోల్చితే, అదే కాలంలో అమెరికా 66 శాతం, చైనా జీడీపీ 44 శాతం పెరిగాయి. దీంతో, భారతదేశం ఇప్పుడు యునైటెడ్ స్టేట్స్ (30.3 ట్రిలియన్ డాలర్లు), చైనా (19.5 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4.9 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (4.4 ట్రిలియన్ డాలర్లు) తర్వాత ప్రపంచంలో పరంగా ఐదవ అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం, గత దశాబ్దంలో జపాన్ జీడీపీ సున్నాగా పెరగడంతో, భారతదేశం త్వరలో జపాన్‌ను అధిగమించనుంది. గత దశాబ్దంలో యునైటెడ్ కింగ్‌డమ్ జీడీపీ 28 శాతం వృద్ధి చెందగా, ఫ్రాన్స్ జీడీపీలో 38 శాతం వృద్ధిని సాధించింది. 2015లో 2.4 ట్రిలియన్ డాలర్ల నుండి 2025 నాటికి 3.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. 50 శాతం కంటే ఎక్కువ జీడీపీ వృద్ధిని సాధించిన ఇతర అగ్ర ఆర్థిక వ్యవస్థలు రష్యా (57 శాతం), ఆస్ట్రేలియా (58 శాతం), స్పెయిన్ (50 శాతం)గా ఉన్నాయి. భారతదేశ జీడీపీ వృద్ధిని అపూర్వమైన రేటుతో చూపిస్తున్న డేటాను బిజెపి మంత్రి అమిత్ మాల్వియా తన అధికారిక చీ పోస్ట్ ద్వారా పంచుకున్నారు. ఈ వృద్ధి వేగం భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక సూపర్ పవర్‌గా నిలబెట్టింది. 2025 నాటికి జపాన్‌ను, 2027 నాటికి జర్మనీని అధిగమిస్తుందని బీజేపీ నాయకుడు అమిత్ మాల్వియా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో షేర్ చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ అసాధారణ విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి, ఆయన ప్రభుత్వ అవిశ్రాంత కృషికి నిదర్శనమని మాల్వియా పేర్కొన్నారు. చురుకైన ఆర్థిక విధానాలు, సాహసోపేతమైన నిర్మాణాత్మక సంస్కరణలు, వ్యాపారాన్ని సులభతరం చేయడంపై అవిశ్రాంత దృష్టి ద్వారా, మోదీ ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మార్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మునుపటి ఏ ప్రభుత్వం సాధించని విజయం ఇది అని అమిత్ మాలవ్య అన్నారు. మార్చి నెల ప్రారంభంలో, భారతదేశం వివేకవంతమైన విధానాలను ప్రశంసిస్తూ, ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు, దేశం బలమైన ఆర్థిక పనితీరు 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారడానికి కీలకమైన సంస్కరణలను స్వీకరించడంలో సహాయపడుతుందని పేర్కొంది. అధిక-నాణ్యత ఉద్యోగాలను సృష్టించడానికి, దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి నిర్మాణాత్మక సంస్కరణలు చాలా కీలకమని ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు పేర్కొంది. దేశ జీడీపీలో ప్రైవేట్ వినియోగం వాటా పెరిగినందున దేశ ఆర్థిక వృద్ధి మరింత సమతుల్యంగా మారుతోందని ఇటీవల విడుదలైన క్రిసిల్ నివేదిక వెల్లడించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో ముందస్తు అంచనాలో 10 బేసిస్ పాయింట్లు స్వల్పంగా సవరించి 6.5 శాతానికి చేర్చడం జరిగింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన వాస్తవ వృద్ధి కరోనా మహమ్మారికి ముందు దశాబ్దంలో వచ్చిన సగటు 6.6 శాతానికి చేరువైంది. సవరించిన వృద్ధి గణాంకాలపై క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి మాట్లాడుతూ.. గత ఏడాది వృద్ధిలో 100 బేసిస్ పాయింట్లు పెంచి 9.2 శాతానికి సవరించిన తర్వాత ఈ పెరుగుదల సాధ్యమైందని అన్నారు. సాధారణ రుతుపవనాలు, తక్కువ ఆహార ద్రవ్యోల్బణం, ప్రస్తుత ద్రవ్య చక్రంలో 75-100 బేసిస్ పాయింట్ల రేటు కోతలు వంటి అంశాల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేశారు. దేశంలో ప్రైవేట్ వినియోగం నానాటికీ పెరుగుతుంది. ఇది ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ, గృహ పెట్టుబడులు రెండూ వేగంగా అభివృద్ధి చెందాయి. అయితే భారత్‌లో కార్పొరేట్ పెట్టుబడులు ఇంకా ఆశించినంతగా పుంజుకోలేదు. కొనసాగుతున్న సుంకాల యుద్ధాలు, చైనా డంపింగ్ భయం కారణంగా కార్పొరేట్ రంగం పెట్టుబడులపై అంతగా ఆసక్తి చూపడం లేదు. టారిఫ్‌ల వల్ల వచ్చే నష్టాల సంక్లిష్టత ఇప్పటికే ప్రారంభమైంది. రాబోయే నెలల్లోనూ ఇది కొనసాగే అవకాశం ఉంది. దీంతో మా అంచనాలకు ప్రతికూలతలు సృష్టిస్తుందని జోషి అన్నారు.

## తల్లిదండ్రులే...



ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ను నారా భువనేశ్వరి సందర్శించారు. విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, అందరూ బాగా చదువుకొని దేశానికి గర్వకారణంగా మారాలని అన్నారు. విద్యార్థులకు చదువే ప్రథమ ప్రాధాన్యత కావాలని, అతిగా ఫోన్ల వాడకం , అధిక సమయం స్క్రీన్ చూడడం విద్యపైన ఉండాల్సిన వారి దృష్టిని మరల్చుతుందని అన్నారు. ఈ విషయంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని, తమ మనవడు దేవాన్ష్ కూడా టెక్నాలజీని ఎంతమేరకు నేర్చుకోవాలో అంత మేరకు మాత్రమే ఫోన్లు, గాడ్జెట్లు వాడతాడని, అధిక సమయం స్క్రీన్ మీద గడపడం ఉండదని అన్నారు. ఓ తల్లిగా చెబుతున్నానని , టెక్నాలజీని వ్యక్తిత్వ వికాసానికి మాత్రమే వాడుకోవాలని నారా భువనేశ్వరి సూచించారు.

**విద్య, పరిశోధనలకు అధిక ప్రాధాన్యత**

విజ్ఞానంతో నడిచే ఆర్థిక వ్యవస్థ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ కోరుకుంటారు. సామాజిక, ఆర్థిక ప్రగతికి విద్య చాలా కీలకమని ఆయన భావిస్తారు. విద్య, పరిశోధనలు దేశ ప్రగతికి కీలకం కాబట్టి తన పాలనలో సైతం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ ఎప్పుడూ ఉండాలని చంద్రబాబు కోరుకుంటారు. అందుకనే శాస్త్రీయ అవగాహనను పెంచే సంస్థ అయిన అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కు 1999లో 172 ఎకరాలు కేటాయించారు. దీని కారణంగా ఎటువంటి ఫలితాలు వస్తున్నాయో ఇప్పుడు చూస్తున్నాం. ప్రపంచంలో జనభాలో రెండో స్థానంలో ఉన్న మన దేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో 53వ స్థానంలో ఉంది. 2023లో సైన్స్ అండ్ టెక్నాలజీలో పేటేంట్లు పొందడంతో భారత్ ఆరో స్థానంలో ఉంది. త్వరలోనే మన దేశం గ్లోబల్ లీడర్ గా ఎదగాలి. సైన్స్ రంగంలో పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయించాలి. సైంటిఫిక్ టెంపర్ ను విద్యార్థుల్లో పెంచడం కోసం తన మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుంది.





**నిత్యం ప్రజా సేవలోనే**

ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి ప్రజలే కుటుంబసభ్యులు. ఆయన నిత్యం ప్రజల గురించే ఆలోచిస్తారు. ఏపీని నెంబర్ వన్ స్టేట్ చేయాలని, పేదరికం లేని సమాజం స్థాపించాలని ఆయన అనునిత్యం తపిస్తారు. స్వర్ణాంధ్ర - విజన్ 2047 లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారు. చంద్రబాబు గారు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి . ఒక్కోసారి ఆయన రాత్రి 12 గంటల వరకూ పనిచేస్తారు. అయినా ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి యోగా చేస్తారు. నాకు చిన్న వయసులోనే వివాహమైంది. రాజకీయాల గురించి అప్పట్లో నాకు తెలీదు. నేను హెరిటేజ్ వ్యవహారాలు, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చూసుకునేదాన్ని. చల్లపల్లిలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారు. వారిని చూస్తే నాకు గర్వంగా అనిపిస్తుంది. యువత బాగా చదువుకోవాలి. ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధించాలి. టెక్నాలజీ మీద అవగాహన పెంచుకోవాలి. యువత క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై దృష్టి పెడితే అద్భుత ఫలితాలు సాధించవచ్చు.

**తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి**

నా తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి. మా నాన్నగారు ఎంతో కష్టపడి పైకి వచ్చారు. చిన్న వయసులో ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారు. ఆ తర్వాత స్కూల్ కి వెళ్లి చదువుకునే వారు. కుటుంబం కోసం ఆయన పడిన కష్టం మేము కళ్లారా చూశాం. షూటింగులతో బిజీగా ఉండటం వల్ల మేము ఆయన్ని చాలా రోజులు చూసేవాళ్లం కాదు. మేము నిద్రపోయినప్పుడు వచ్చేవాళ్లు... లేచేప్పటికి వెళ్లిపోయేవాళ్లు. మా తల్లిదండ్రులు మమ్మల్ని చాలా పద్దతిగా పెంచారు . ఇంటికి వచ్చే అతిథులను ఎలా గౌరవించాలో మా అమ్మగారు మా అందరికీ చెప్పేవారని నారా భువనేశ్వరి అన్నారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి నారా భువనేశ్వరి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,డాక్టర్ సురేష్ బాబు,టి టి డి బోర్డు నెంబర్ శాంతారాం,నియోజకవర్గ టిడిపి నాయకులు మహిళా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సభ నడిపే పద్ధతి...

విమర్శించారు. తాను మాట్లాడేందుకు ఎప్పుడు లేచి నిలబడ్డా స్పీకర్ మాట్లాడనివ్వడం లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. కనీసం మాట్లాడనివ్వకపోతే తమ వాయిస్‌ను ఎలా వినిపించాలని ఆయన ప్రశ్నించారు. తనను ఒక్క ముక్క కూడా మాట్లాడనివ్వలేదని ఆరోపించారు. గడిచిన ఏడు ఎనిమిది రోజులుగా స్పీకర్ తన విషయంలో ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇది ప్రభుత్వ కొత్త వ్యూహమని, సభలో ప్రతిపక్షాలకు చోటులేదని విమర్శించారు. ఇటీవల లోక్‌సభలో ప్రధాని మోదీ కుంభమేళాపై ప్రసంగం చేసినప్పుడు కూడా తాను మాట్లాడేందుకు ప్రయత్నించానని, అప్పుడు కూడా స్పీకర్ తనకు అనుమతి ఇవ్వలేదని రాహుల్‌గాంధీ ఆరోపించారు. స్పీకర్ ఉద్దేశం ఏమిటో తనకు అర్థం కావడం లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రూల్ 349కు అనుగుణంగా నడుచుకుంటారని భావిస్తున్నామంటూ స్పీకర్ సభను వాయిదా వేయడాన్ని రాహుల్‌గాంధీ తప్పుపట్టారు. రూల్ 349కు విరుద్ధంగా తాను ఏం చేశానని ప్రశ్నించారు. ప్రధాని మోదీ కుంభమేళాపై ప్రసంగిస్తుండగా తొక్కిసలాటలో మరణించిన వారి గురించి ప్రస్తావించాలంటూ ప్రతిపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేశారని, కానీ ప్రధాని తొక్కిసలాట మృతులకు కనీసం సంతాపం కూడా తెలియజేయలేదని రాహుల్‌గాంధీ విమర్శించారు. పైగా స్పీకర్ రూల్ 372ని విధించారని, ఈ రూల్ ప్రకారం ప్రధానిగానీ, మంత్రిగానీ మాట్లాడుతున్నప్పుడు ఇతర సభ్యులు ఎలాంటి ప్రశ్నలు వేయకూడదని రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష నాయకుడికి మాట్లాడే అవకాశం ఉంటుందని, కానీ వీళ్లు మాత్రం తనను మాట్లాడనివ్వడంలేదని ఆరోపించారు.

# కేటీఆర్ కాన్ఫిడెన్సా...

హైదరాబాద్, : నేను కేసీఆర్ అంత మంచోడ్ని కాదు, మేం అధికారంలోకి వస్తే ఎవర్నీ వదిలిపెట్టం.. ఇలాంటి డైలాగులతో కేటీఆర్ ఎవర్ని మెప్పించాలనుకుంటున్నారు..? ఇప్పటికే కొంతమంది నాయకులు చేజారారు, కేడర్ కూడా పార్టీకి దూరమవుతోంది. ఈ దశలో కాంగ్రెస్ పై, సీఎం రేవంత్ రెడ్డిపై పదే పదే తీవ్ర విమర్శలు చేస్తూ హైలైట్ కావాలనుకుంటున్నారు కేటీఆర్. బీఆర్ఎస్ రజతోత్సవ సభతో అయినా కేడర్ లో కాస్త ఉత్సాహం వస్తుందేమోనని ఆయన ఆశ. కానీ ఆ ఆశ నెరవెరేలా లేదు.తెలంగాణలో బీఆర్ఎస్ తిరిగి పుంజుకోగలదా..? ఆ పార్టీ నేతలు మాత్రం పైకి మేకపోతు గాంభీర్యం చూపిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పని అప్పుడే అయిపోయిందని రాబోయేది తమ ప్రభుత్వమేనని చెప్పుకుంటున్నారు. అందులోనూ అధికారానికి దూరంగా ఉండాలంటే కేటీఆర్ లాంటి నాయకులకు అస్సలు కుదరట్లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోపే ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టారు కేటీఆర్. సీఎం విఫలమయ్యారని, ఆయనకు పార్టీలో ఎవరి సపోర్ట్ లేదని బురదజల్లాలనుకున్నారు. కాంగ్రెస్ లో రేవంత్ రెడ్డిని ఒంటరిని చేయాలనేది బీఆర్ఎస్ ఎత్తుగడ. అందుకేసం సోషల్ మీడియా ద్వారా పదే పదే తప్పుడు ప్రచారం చేసింది. చివరకు పెయిడ్ జర్నలిస్ట్ లతో చేసిన ఎత్తుగడలు కూడా విఫలమయ్యాయి. తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు కూడా.రెండేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ని ప్రజలు 2023 ఎన్నికల్లో నిర్ద్వందంగా తిరస్కరించారు. అప్పటికీ ఆ పార్టీలో మార్పు రాలేదు. దీంతో ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కి పెద్ద షాకిచ్చారు. ఆ ఓటమిని కూడా మసిపూసి మారేడుకాయ చేయాలనుకున్నారు కేటీఆర్. జనంలోకి రాని కేసీఆర్, ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఇరుక్కున్న కవిత.. ఇలా బీఆర్ఎస్ ప్రతిష్ట ఎప్పుడో మంటగలిసి పోయింది. భవిష్యత్ నాయకుడిగా చెప్పుకుంటున్న కేటీఆర్ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అటు హరీష్ రావు నుంచి ఆపద ఉందని తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు కేటీఆర్. అందుకే ఆయన త్వరలో పాదయాత్ర చేపడతానని ప్రకటించారు.రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఇప్పుడు కేసీఆర్ గుర్తొస్తున్నారనేది కేటీఆర్ వ్యాఖ్యానం. కేసీఅర్ ని ఎందుకు ముఖ్యమంత్రి చేసుకోలేకపోయామా అని వారు బాధపడుతున్నారట. ఆ మాటకొస్తే రాష్ట్ర ప్రజలే ఇప్పుడు కేసీఆర్ కి గుర్తొస్తున్నారు. ప్రజలను ఎందుకు దూరం చేసుకున్నామా అని ఆయన బాధపడుతూ ఉండొచ్చు. అధికారం పోయిందని కేటీఆర్ అంతకంటే ఎక్కువ బాధపడుతూ ఉండొచ్చు. అది బాధే కానీ, పశ్చాత్తాపం కాదని ఆయన పలుమార్లు తన మాటలతో రుజువు చేశారు కూడా. ఓటములనుంచి గుణపాఠాలు నేర్చుకుని ప్రజల్లోకి రావాలి కానీ, ప్రజలు కాంగ్రెస్ చేతిలో మోసపోయారంటూ తమని తాము కవర్ చేసుకోవాలని చూడటం కేటీఆర్ అవివేకం. అయినా ప్రజల ముందు గంభీరంగా ఉండాలి. ఓడిపోయినా తమ తప్పేమీ లేదని చెప్పుకోవాలి, కేడర్, లీడర్ చేజారకుండా చూసుకోవాలి. అందుకే కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుంటారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా గులాబీ జెండా రెపరెపలాడుతుందని సవాళ్లు విసురుతున్నారు.త్వరలో జరగబోతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం కరీంనగర్ లో నిర్వహించగా ఆ సమావేశంలో కేటీఆర్ మరోసారి సవాళ్లతో కేడర్ ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఏప్రిల్ లో నిర్వహించే రజతోత్సవ సభతో తిరిగి పుంజుకుంటామని అంటున్నారాయన. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టింగ్ లు పెట్టిన వారిని పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని నానా యాగీ చేస్తున్నారు కేటీఆర్. బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని అంటున్నారు కాంగ్రెస్ నేతలు.అసలింతకీ బీఆర్ఎస్ జాతీయ పార్టీనా, రాష్ట్ర పార్టీనా అనే కౌంటర్లు కూడా పడుతున్నాయి. జాతీయ రాజకీయాల్లో వెలిగిపోవాలనే ఆశతో పార్టీ పేరు కూడా మార్చేసి, పక్క రాష్ట్రాల్లో ఆఫీసులు కూడా తెరిచేసి ఆమధ్య హడావిడి చేశారు. తీరా సొంత రాష్ట్రంలో ఘోర పరాభవంతో ఆ మాటే ఎత్తకుండా సైలెంట్ అయ్యారు. పార్టీ పేరు తిరిగి టీఆర్ఎస్ గా మార్చేస్తారనే వార్తలు వినిపించినా ఇక్కడ కూడా కేసీఆర్, కేటీఆర్ కి ఇగో అడ్డు వచ్చింది. పార్టీ పేరు తిరిగి మార్చేస్తే కాంగ్రెస్, బీజేపీనుంచి పడే కౌంటర్లను తట్టుకోలేమని సైలెంట్ అయ్యారు. ఎప్పటికైనా పార్టీ పేరు జాతీయ స్థాయిలో మార్మోగి పోతుందని లేనిపోని బీరాలు పలుకుతున్నారు కేసీఆర్, కేటీఆర్.



## హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడలేను..

బిల్లుపై చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. ఈ బిల్లుపై చాలామంది సభ్యులు విలువైన సూచనలు చేశారని, ఈ బిల్లులో లేని అంశాలను సభ్యులు ప్రస్తావించారని తెలిపారు. సభ్యులు ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలిస్తామని ఆమె వెల్లడించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట వరకు షెడ్యూల్ ఏరియాలో గుర్తించారని, ఆ చట్టాన్ని 1/70గా పిలుస్తారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రత్యేక హక్కులు కల్పించేందుకు, అభివృద్ధి జరిగేందుకు 1/70 చట్టం కృషి చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఏజెన్సీ ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ అయితే అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారని ఆమె అన్నారు. ములుగును మున్సిపాలిటీగా చేసుకుంటున్నామని సీతక్క అన్నారు. ప్రజల అభిప్రాయం, కలెక్టర్లు పంపిన ప్రతిపాదనల ఆధారంగా మున్సిపాలిటీలుగా నవీకరిస్తున్నట్లు తెలిపారు. కొన్ని గ్రామాలు ఒక మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్నాయని, రెవెన్యూ పరంగా మరో మండలంలో ఉంటున్నాయని, ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును మనం ఆమోదించుకున్నామని, కేంద్రం ఆ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తే రిజర్వేషన్లు పెరుగుతాయని అన్నారు. అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు.

## చంద్రబాబుకు మెసేజ్ చేసినా...

చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి అనితకు మెసేజ్ లు చేసినా వారి నుంచి రెస్పాన్స్ రాలేదని తెలిపారు. ప్రవీణ్ మృతిపై క్రైస్తవులకు ఉన్న అనుమానాలను అధికారులు నివృత్తి చేయాలని చెప్పారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందో ఆధారాలతో వివరించాలని కోరారు.

## కొత్త జిల్లాలలో ఎటువంటి...

రియల్ టైమ్‌లో పరిష్కరించేందుకై వచ్చే మాసం నుంచి సీనియర్ అధికారులు అంతా గ్రామాల్లో మూడు నాలుగు రోజులు పృటించాలని ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

**జపాన్ ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం :**

రాజధాని అమరావతిలో ఈరోజు జపాన్ రాయబారి కెయిచి ఓనో నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సమావేశమైనట్లు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ భేటీలో పరస్పర సహయసహకారాలపై కీలక చర్చ జరిగినట్లు ముఖ్యమంత్రి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. "బుధవారం అమరావతిలో జపాన్ రాయబారి కెయిచి ఓనో నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సమావేశమయ్యాం. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడం, ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ పెట్టుబడులను విస్తరించడంపై చర్చలు జరిగాయి. వృద్ధికి కొత్త అవకాశాలను అందించడానికి నౌకానిర్మాణం, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఆటోమొబైల్స్, విద్య వంటి వివిధ రంగాలలో సహకారాన్ని అన్వేషించడంపై మా చర్చలు కొనసాగాయి" అని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## మాజీ మంత్రి...



మధ్యాహ్నం తర్వాత కొడాలి నాని ఆరోగ్య పరిస్థితికి సంబంధించి డాక్టర్లు హెల్త్ బులిటెన్ విడుదల చేసే అవకాశముంది. గత రెండు రోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మరోవైపు కిడ్నీ సమస్య ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం కొడాలి నానికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. కొడాలి నాని అస్వస్థతకు గురయ్యారనే వార్త తెలియగానే వైసీపీ నేతలు ఆయనను పరామర్శించేందుకు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పేందుకు ఒక్కొక్కరుగా ఏఐజీ ఆసుపత్రికి వస్తున్నారు. ఇక గుడివాడ నియోజవర్గ పరిధిలో నాని అభిమానులు, అనుచరులు ఆయన ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోవడంతో కొన్నాళ్లుగా కొడాలి నాని పొలిటికల్‌గా యాక్టివ్‌గా లేరు. పార్టీ కార్యక్రమాలకు ముందుడే ఆయన.. సరిగా కనిపించడంలేదు. ఇక సోషల్ మీడియాలో ఆయన అనారోగ్య కారణలతో రాజకీయాలకు దూరంగా ఉంటున్నారంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయనకు హార్ట్‌ఎటాక్ రావడం అటు పార్టీ శ్రేణుల్లో.. ఇటు కుటుంబ సభ్యుల్లోనూ ఆందోళన నెలకొంది.

## ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు...

చెల్లించవలసి ఉంటుందన్నారు.

**పట్టణ ప్రాంతాల్లో.. :**

పట్టణ ప్రాంతాల్లో బుక్ చేసిన 24 గంటల లోపు.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే 48 గంటల లోపు గ్యాస్ డెలివరీ చేస్తారని మంత్రి నాదెండ్ల అన్నారు.ఆ తర్వాత సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్దిదారుల ఖాతాల్లో తిరిగి జమ అవుతుందన్నారు. ఒక సంవత్సరంలో 3 గ్యాస్ సిలిండర్లు ఇలా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అయితే వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం కూడా ఉందని మంత్రి చెప్పారు.

**ప్రతి ఏడాది :**

ప్రతి ఏడాది ఏప్రిల్ - జూలై (01), ఆగష్టు -నవంబర్ (01), డిసెంబర్ - మార్చి (01) నెలల మధ్య ఉచిత గ్యాస్ సిలెండర్ బుక్ చేసుకోవచ్చునని, ఎటువంటి సమాచారం లోపం ఉన్న టోల్ ఫ్రీ నెం.1967కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు.

**ఎలా పొందవచ్చంటే.. :**

రేషన్‌కార్డు ఉన్న గ్యాస్ వినియోగదారులంతా ఫ్రీ గ్యాస్? సిలిండర్ పొందేందుకు అర్హత ఉందో లేదో చెక్ చేయించుకోవాలి. గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబర్ లింక్ అయ్యాయో లేదో చూసుకోవాలి. బ్యాంకు అకౌంట్ యాక్టివ్‌లో లేకపోతే వెంటనే పునరుద్ధరించుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ స్కీమ్ ప్రారంభం నుంచి అధికార యంత్రాంగం మండలాల వారీగా లబ్ధిదారులను చాలా వరకు అప్రమత్తం చేయడంతో ఎక్కువ శాతం మంది ఇప్పటికే లబ్ధి పొందారు. ఫ్రీ గ్యాస్ సిలిండర్ తీసుకున్న వారికి నిర్ణీత వ్యవధిలో సొమ్ము వారి బ్యాంక్? అకౌంట్?లో జమ అవుతుంది. పలువురికి సాంకేతిక కారణాలతో డబ్బులు అకౌంట్?లో పడలేదని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు తొలి ఫ్రీ గ్యాస్ సిలిండరు పొందని వారు ఉంటే వెంటనే బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## యోగ సమ్మర్ క్యాంప్....
# గోడపత్రిక ఆవిష్కరణ



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి26: అన్నమయ్య జిల్లా పీలేరు మోటార్ వెహి కల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ షి దివ్య యోగ విద్యాలయం వారి సమ్మర్ క్యాంప్ గోడపత్రిక ను ఆవిష్కరించారు. యోగా క్యాంప్ రెగ్యులర్ యోగ క్లాసులను సద్వి ని యోగం చేసుకోవాలని అధ్యక్షురాలు డాక్టర్ పి వి ఎస్ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం లో న్యాయ సలహాదారు డాక్టర్ రాయల్ సుధాకర్ పాల్గొన్నారు.

# 29న విశ్వావసు ఉగాది వేడుకలు

వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 26. : వీ.కోట మండలంలో 2025 మార్చి నెల 29న విశ్వావసు తెలుగు సంవ త్సరాది ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ తెలుగు రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పసపల హరికృష్ణా రెడ్డి,డాక్టర్ వి. రఘుపతి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తెలుగు కవులు ఈ ఉగాది వేడుకల్లో పాల్గొనాలని, పాల్గొనదలచిన కవులు కవయిత్రులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ ఉగాది వేడుకలు వీకోట పట్టణం కే. కొత్తూరు గ్రామంలోని రాగ శ్రీ దివ్యజ్ఞాన పాఠశాల ఆవరణలో జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పదిమంది అభ్యుదయ ఆదర్శ రైతులను కూడా ఘనంగా సన్మానిస్తున్నట్లు వారు తెలియజేశారు .ఈ వేడుకల సందర్భంగా పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి సేవనం, కవి సమ్మేళనం, కవులకు ఘన సన్మానం ఉంటాయని వారు తెలిపారు .వివరాలకు పసపల హరికృష్ణ 9441911161 రఘుపతి 8328642033 నెంబర్లను సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## గ్రామపంచాయతీ వేలంపాట .....
# పారదర్శకంగా నిర్వహించాలి

**పీలేరు పంచాయతీ ఈవో కి వినతిపత్రం సమర్పించిన ఎన్.ఎస్.యూ.ఐ నేత అమృత్ తేజ**



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: అన్నమయ్య జిల్లా పీలేరు గ్రామపంచా యతీ పరిధిలోని షాపింగ్ గదులు, వారపు సంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతువుల శాల మరియు మాంసపు అంగ ళ్ళకు సంబంధించి నేడు నిర్వహించనున్న బహిరంగ వేలంపాటను సీసీ కెమెరా పర్య వేక్షణలో మరియు టెండర్ కాలాన్నిమూడు సంవత్సరాలకు పెంచాలి అని ఎన్.ఎస్. యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల. అమృత్ తేజ ఆధ్వర్యంలో పీలేరు మేజర్ గ్రామపంచాయతీ ఈవో గురు మోహన్ గారికి వినతిపత్రం సమర్పించారు.పీలేరు గ్రామపంచాయతీ పరిధిలోని షాపింగ్ గదులు, వారపు సంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్,జంతువుల శాల మాంసపు అంగళ్ళకు సంబంధించి బహి రంగ వేలంపాట నిర్వహించుటకు ప్రకటన జారీ చేసిన విషయం అందరికీ విధితమే అన్నారు. ఈ వేలంపాట ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, న్యాయంగా ఉండాలి అంటే సీసీ కెమెరాల పర్యవేక్షణలో వేలంపాట నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ నాయకుల మహేష్, మంజునాథ్, భాను, లిఖిత్, ఆదిత్య, స్వామి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ తోకల మురళి రెడ్డి ఆధ్వర్యంలో .....
# ఎంపీపీ నిధులతో తాగునీటి బోరు



వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం గొడుగు చింత పంచాయతీ తార్లబైలు పాలమడుగు ఇండ్ల దగ్గర పెరుమాళ్ళపల్లి ఎంపీటీసీ తోకల మురళి రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ నిధులతో తాగునీటి బోరు వేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సుమారు ఐదు నుంచి నీళ్లు పడడం జరిగింది కావున ఆ గ్రామ ప్రజలు స్థానిక ఎంపీటీసీని అభినందించడం జరిగినది.

# తెలంగాణ ఎమ్మెల్యేలకు హనీట్రాప్...?

హైదరాబాద్, :తెలంగాణలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు టార్గెట్‌గా కొత్త రకం హనీట్రాప్ నడుస్తోంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫోన్ నెంబర్లను కనుక్కొని మరి వీడియో కాల్ చేసి బెదిరిస్తున్నారట. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నేహ శర్మ అనే పేరుతో వీడియో కాల్స్ వచ్చినట్లు తెలుస్తోంది. పలువురు ఎమ్మెల్యేలు పోలీసులకు ఫిర్యాదు చేయగా మరికొందరు మాత్రం ఎందుకు వచ్చిన తలనొప్పి అంటూ సైలెంట్‌గా ఉంటున్నారు.హాట్ టాపిక్‌గా మారడంతో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నేతల మధ్య ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. అసెంబ్లీ లాబీలో, ఎల్పీ ముందు పలువురు నేతలు ఈ విషయంపై చర్చించుకుంటున్నారు. తనకు కాల్ వచ్చిందని ఒక ఎమ్మెల్యే చెప్పగా, తనకూ కాల్ వచ్చిందని మరో ఎమ్మెల్యే తన అనుభవం చెప్పుకొని గోడు వెళ్ళబోసుకుంటున్నారు.

# అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే ఆరా





పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: పలమనేరు నియోజకవర్గంలో జరుగుతు న్న అభివృద్ధి పనులపై పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి అధికారులతో బుధవారం ఆరా తీశారు. స్థానిక కార్యాల యంలో మున్సిపల్,అటవీ,రెవిన్యూ అధికా రులతో విడివిడిగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ఎద్దడిని ఎదుర్కొనేం దుకు తీసుకున్న చర్యలు, మున్సిపల్ పరి ధిలోని తాగునీటి బోర్ల పరిస్థితి,అందు బాటులో ఉన్న నీటి నిల్వలు,వీధి వ్యాపా రులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టా ల్సిన చర్యలు, పెండింగ్ లో మున్సిపల్ షాపింగ్ కంప్లెక్స్ పనులపై చర్చించారు. అదేవిధంగా గంటావూరు కాలనీలో ఇంటి పట్టాల విచారణ పై రెవిన్యూ అధికారుల తో ఆయన వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఇక పలమనేరు మండలంలోని ముసలిమడుగు వద్ద ఏర్పాటు కానున్న ఎలిఫెంట్ హబ్ పనుల పై స్థానిక ఎఫ్ఆర్వో నారాయణతో ఆయన సమీక్షించారు. ఇప్ప టిదాకా జరిగిన పనులను త్వరలో వచ్చి పరిశీలిస్తామని ఆ ప్రాజెక్ట్ ఏర్పాటులో ఏదే ని ఇబ్బందులుంటే తెలియజేస్తే పరిష్కారా నికి చొరవ చూపుతానని పేర్కొన్నారు. ఈ సమీక్షల్లో తహసీల్దార్ ఇన్బనాథన్, కమిష నర్ రమణారెడ్డి,ఆర్వో రవి రెడ్డి,సర్వే ఆఫీ సర్ వెంకటరమణ రెడ్డి,మెప్మా సిఎంఎం బాబా, డిఈ సురేష్ కుమార్, ఏఈ స్వప్న ప్రియా, టిపిఎస్ ఇందిరా, వీఆర్వో కృష్ణ తదితరులున్నారు.

# సమాజ సేవలో భాగస్వాములు కండి

## డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు





శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: శ్రీకాళహస్తి తొట్టంబేడు సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రముఖ సంఘ సేవకులు, శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ యల్లంపాటి కోటే శ్వరబాబు పిలుపునిచ్చారు.వేసవిలోఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠ శాలల్లో చదివే విద్యార్థులకు కోటేశ్వర బాబు ఓఆర్ఎస్, గుడ్ డే బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సంగతి పాఠకులకు తెలి సిందే. కోటేశ్వరబాబు ఇప్పటికే శ్రీకాళహస్తి, తొట్టంబేడు,ఏర్పేడు,రేణిగుంట మండలా ల్లో పలు పాఠశాలల్లో వీటిని పంపిణీ చేశాడు. ఇందులో భాగంగా బుధవారం తొట్టంబేడు మండల పరిధిలోని శేషమ నాయుడుకండ్రిగలో 45 మంది, పూడిలో 40 మంది, ఇలగనూరులో 50 మంది,ఇల గనూరు అంగన్వాడీ కేంద్రంలో 12 మంది, గుర్రప్పనాయుడుకండ్రిగలో 22 మంది, గాంధీ సెంటరులో 20 మంది,పెద్ద కనపర్తి లో 36 మంది,మొత్తం 224మందివిద్యార్థు లకు ఓఆర్ఎస్,ప్యాకెట్లు అందజేశారు. ఈ సందచర్భంగా కోటేశ్వరబాబు మాట్లాడు తూ తాను కూడా మధ్య తరగతి కుటుం బంలో జన్మించానని అయితే పేదలకు అండగా ఉండాలనే ఆశయంతో ఈ సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. సమాజ సేవ చేయడంలో తనకు ఎంతో తృప్తి ఉంద న్నారు. తాను గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యా సామాగ్రి, పరీక్ష సామాగ్రి అందచేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ బడుల్లో చదివే ప్రాథమిక పాఠశాలల విద్యా ర్థులకు ఓఆర్ఎస్,గుడ్ డే బిస్కెట్ ప్యాకె ట్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు చెప్పారు. విద్యార్థులు ఎండ తీవ్రత నుంచి ఉపశమ నం పొందడానికి వీటిని అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఎండ ఎక్కువగా ఉన్నపుడు బయటకు పంపకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోగలుగు తారన్నారు. ఇక విద్యా ర్థులు కూడా బాల్యం నుంచే సేవా గుణం అలవరచుకోవాలని కోటేశ్వరబాబు కోరు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశా లల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి మహిళా జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడండి



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: శ్రీకాళహస్తి పట్టణం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడాలని శ్రీకాళహస్తి పిడిఎస్యు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ జాకీర్ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా కళాశాలకు మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సుమారు 7 ఎకరాలు స్థలం కేటాయించడం జరిగింది. ఆ స్థలం మొత్తం కబ్జాకు గురి కావడం జరిగిందని వెంటన కాపాడి కాంపౌండ్ నిర్మించాలని కోరారు. కబ్జాదారులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ మహిళ కళాశాలలో సుమారు 2000 మంది ఆడబిడ్డలో విద్యాబాలసం చేస్తున్నారని వారికి భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## మీ సమస్యలను పరిష్కరించడమే ....
# నా ప్రథమ కర్తవ్యం

**శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి**



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బుధవారం శ్రీకాళహస్తిలోని పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ నందు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రభుత్వమని, మీ సమస్య లు పరిష్కరించడం మే నా ప్రథమ కర్తవ్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల తాసిల్దార్ మధుసూదన్ రావు, శ్రీకాళహస్తి మండలం తాసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవోలు తొట్టం బేడు ఎంపీడీవో సురేంద్రనాథ్, శ్రీకాళహస్తి ఎంపీడీవో, తదితర అధికారులు,నాయకులు ప్రజలు పాల్గొన్నారు.


## జపాన్ పెట్టుబడులకు.....
# ఆంధ్రప్రదేశ్ కీలక గమ్యం

శ్రీసిటీ, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: జపాన్ కనెక్ట్ విత్ ఆంధ్రప్రదేశ్' సెమినార్‌లో శ్రీసిటీ ఎండీ.శ్రీసిటీ, మార్చి 26, 2025: భారతదేశంలోని జపాన్ రాయబారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి (ఈ.డి.బి), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్.ఐ.సి.సి.ఐ) సంయుక్తంగా, "పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంబంధాలు & విద్య" అంశాలపై నిర్వహించిన సెమినార్ బుధవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమం జపాన్–ఆంధ్రప్రదేశ్ మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి వేదికగా నిలిచింది.ఈ సదస్సులో భారతదేశంలో జపాన్ రాయబారి ఓనో కెయిచీ, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు & వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి, పాల్గొన్నారు.ఎఫ్.ఐ.సి.సి.ఐ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డా. గుణవీనా చద్దా సమన్వయం చేయగా, విశ్వ సముద్ర హోల్డింగ్స్ మేనుఫ్యాక్చరింగ్ సి.ఈ.ఓ జితేంద్ర నిమ్మగడ్డ అతిథులకు స్వాగతం పలికారు. . జపాన్ రాయబారి ఓనో కెయిచీ, భారతదేశంతో జపాన్ వ్యాపార సంబంధాలను ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు.జపనీస్ పెట్టుబడులకు శ్రీసిటీ ప్రధాన వేదికగా మారిందని గుర్తు చేశారు. మంత్రి టి.జి. భరత్ పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక సహకారాన్ని మరింతగా పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.ఆంధ్రప్రదేశ్–జపాన్ కనెక్ట్ విధానం ద్వారా జపనీస్ కంపెనీలను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యూహాలను మంత్రి భరత్ వివరించారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వాన్ని ప్రశంసించిన డా. రవీంద్ర సన్నారెడ్డి, జపాన్–భారత సంబంధాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న వ్యూహాత్మక నిర్ణయాలను, తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. దక్షత గల నాయకత్వం, విదేశీ పెట్టుబడుల కోసం స్నేహపూర్వక వాతావరణం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక భౌగోళిక స్థానం, మొదలగు కారణాల వల్ల పెట్టుబడులకు రాష్ట్రం కీలక గమ్యంగా మారిందని ఆయన పేర్కొన్నారు.



## పురాతన శివాలయానికి కంచి పిఠాధిపతి ని....
# ఆహ్వానం పలికిన శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు





శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: శ్రీకాళహస్తి తొట్టంబేడు నియోజక వర్గం తొట్టంబేడు మండలం తంగేళ్ల పాలెం గ్రామంలో శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీ నాయుడు స్వగ్రామంలో ఉన్న 1000 ఏళ్లు పురాతన గిరి సుధా సమేత శ్రీ నీలకంటేశ్వర స్వామి ఆలయాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర స్వామి పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు కంచి పీఠాధిపతులు పురాతన ఆలయ ప్రాంగణం ను పరిశీలించి పునర్నిర్మాణానికి సూచనలు చేసి ఆ ప్రాంగణంలో విశేష పూజలు జరిపారు. వాయు స్వరూపమైన మనసును నిలకడ చేసి ధ్యానంతో భగవంతుని సేవించి పుణ్యం సంపాదించుకోవాలని కంచి పీఠాధిపతులు పిలుపునిచ్చారు. తంగేళ్లపాలెం గ్రామంలో పురాతన శివాలయం గిరి సుత సమేత శ్రీ నీలకంటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాన్ని కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి పరిశీలించారు. పురాతన ఆలయాన్ని పునర్నిర్మాణం చేయాలని మాజీ ఎమ్మెల్యే సంకల్పం ఆ మేరకు పురాతనమైన ఆలయాన్ని పునర్నిర్మాణానికి కంచి స్వాములు సూచనలు కోసం కంచి పీఠాధిపతులను మాజీ శాసనసభ్యులు ఎస్సివి నాయుడు ఆహ్వానించారు. ఎస్ సి వి ఆహ్వానం మేరకు కంచి స్వామి గ్రామానికి వచ్చి పురాత న ఆలయ ప్రాంతంలో పూజలు జరిపి ఆలయ పున నిర్మాణానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీవీ నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు కంచి పీఠాధిపతులను ఘనంగా సత్కరించి పాదపూజ శాస్త్రవేత్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను పీఠాధిపతులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు బహూకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉద్దేశించి కంచి పీఠాధిపతులు ప్రసంగిస్తూ నూతన ఆలయం నిర్మించడం కన్నా పురాతన ఆలయాన్ని జీర్ణోద్ధారణ చేసి నిర్వహణ చేయడం ఎంతో పుణ్యఫలమని తంగేల్ల పాలెం గ్రామం లో పురాతన ఆలయాన్ని పునర్ నిర్మించడంకి ప్రయత్నించడం పూర్వజన్మ వరప్రసాదమని గ్రామాలను ఆధ్యాత్మిక చింతనలో మనుషులను సత్మార్గంలో జీవనం సాగించేలా చేస్తాయన్నారు. వాయు లింగేశ్వరుడు కొలువుతీరిన ఈ ప్రాంతాలు సైబాలయాలకు సైవాలయాలకు నిలయమన్నారు. వాయువులు నియంత్రించడం ఎంత కష్టమో మనసును నియంత్రించడం కూడా అంతే కష్టమని దీనికోసం సాధన చేసి ధ్యానం ద్వారా భగత్ సంకల్పం చేయాలన్నారు. మనిషికి ఆశ ఉండాలని దురాశ ఉండరాదు అన్నారు. ప్రతి గ్రామంలోనూ ధర్మం పాటించాలన్నారు. శంకరాచార్యుల పర్యటించిన ఈ ప్రాంతంలో ధర్మం వర్ధిల్లాలని పుణ్యం రావాలంటే భక్తి దానం ధర్మం సేవ ద్వారా వస్తుందని మంచి కుటుంబ వ్యవస్థ మన హిందూ సాంస్కృతను పెంపొందిస్తాయని మానవులు మంచి మార్గంలో సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సివి నాయుడు తో, సర్పంచ్ చెంచు కృష్ణ నాయుడు,ఎస్సీ వి దిలీప్, ఎస్సీ వి కిరణ్, గ్రామస్తులు స్థానిక ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ....
## "పోషణ్ భీ - పడాయి భీ" శిక్షణా కార్యక్రమం




కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 26: సి.డి.పి. ఐ.సి.డి.యస్. ప్రాజెక్ట్ కుప్పం అధ్వర్యంలో మూడు రోజులపాటు అనగా మార్చి 25నుండి27 వరకూ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలోభాగంగాకుప్పం, గుడుపల్లి మండలాల అంగన్వాడి కార్య కర్తలకు బరువు తక్కువ ఉన్న పిల్లలకు ఏవిధంగా ఆహారాన్ని అందించి వారిని సాధారణ స్థాయికి తీసుకోనిరావాలి అనే అంశం మీద,ఆట,పాట, కథల ద్వారా పిల్ల లకు వివిధ నైపుణ్యాభివృద్ధి ఎలా సాధిం చాలి, అనే అంశాలపై పూర్తి అవగాహన కల్పించేవిధంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. మరియు పిల్లలకు జాతీయవిద్యా విధానం (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ) లో భాగంగా 3 సం. లోపు పిల్లలకు "నవచేత్న" 3 సం నుంచి 6 సం. లోపు పిల్లలకు "ఆదార్శిల", పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల గురిం చి శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం లో కుప్ప ప్రాజెక్ట్ సంబంధిత అంగన్వాడి కార్యకర్తలు అందరూ పాల్గొని ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమం పట్ల తమ సంతృప్తిని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి. యస్. ప్రాజెక్ట్ కుప్పం సి.డి.పి.ఓ.యం, చంద్రకళ,సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## టూరిజం హబ్ గా విజయవాడ



విజయవాడ : అమరావతికి గేట్ వేగా ఉన్న విజయవాడను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య, పర్యాటక కేంద్రంగా విరాజిల్లిన విజయవాడకు.. పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కృష్ణా తీరంలోని బెజవాడ నగరాన్ని వివిధ రంగాల సమగ్ర అభివృద్ధితోనూ పరుగులు తీయించాలని.. ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం అన్ని వర్గాల ప్రజలను భాగస్వాముల్ని చేసేందుకు.. ఎన్టీఆర్ జిల్లా అధికారులు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

1.విజయవాడకు పుదుచ్చేరి తరహాలో బ్రాండింగ్ తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 'వైబ్రెంట్ విజయవాడ' పేరుతో ఒక లోగోను రూపొందించాలని అధికారులు భావిస్తున్నారు.

2.ప్రభుత్వ శాఖలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్ అసోసియేషన్, ఇతర సంఘాల సహాయంతో పర్యాటక ప్యాకేజీని రూపొందించనున్నారు. విజయవాడలో ఉన్న పర్యాటక ప్రదేశాలను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

3.మంటపం, గాంధీ కొండ, ప్రకాశం బ్యారేజీ, రాజీవ్ గాంధీ పార్కు, మొగల్రాజపురం గుహలు, ఉండవల్లి గుహలు, భవానీ ద్వీపం, కొండపల్లి కోట వంటి ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నారు. కనకదుర్గ అమ్మవారి దేవాలయం, మరకత రాజరాజేశ్వరీ దేవాలయం, వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం, ఆంజనేయస్వామి వారి దేవాలయం, ప్రసన్న గణపతి దేవాలయం, త్రిశక్తి పీఠం, రామలింగేశ్వర స్వామి దేవాలయం వంటి మతపరమైన పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నారు.

4.పర్యాటకులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పర్యాటకులకు వసతి, రవాణా, ఆహారం, ఇతర సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

5.విజయవాడ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం వివిధ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. విజయవాడ పర్యాటక ప్రదేశాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

6.విజయవాడలో భవాని ద్వీపం మంచి టూరిస్ట్ స్పాట్. భవాని ద్వీపాన్ని ఒక గొప్ప పర్యాటక ప్రదేశంగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అక్కడ కొత్త పర్యాటక ఆకర్షణలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

7.ప్రకాశం బ్యారేజీని కూడా పర్యాటక ప్రదేశంగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బ్యారేజీ చుట్టూ పర్యాటక సౌకర్యాలు అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

8.విజయవాడలో ఉన్న చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆ ప్రదేశాలను పర్యాటకులకు ఆకర్షణీయంగా మార్చడానికి చర్యలు తీసుకుంటోంది.

9.విజయవాడ నగరంలోనే కాకుండా.. చుట్టూ కొత్త హోటళ్లు, రిసార్ట్‌లను నిర్మించడానికి ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. అలాగే బెజవాడ చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

10.విజయవాడకు దేశంలో ఎక్కడినుంచైనా సులభంగా చేరుకోవచ్చు. ఎయిర్, రైల్వే, రోడ్ కనెక్టివిటీ ఉంది. దీంతో పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎన్టీఆర్ జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ....
# మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు కార్యక్రమం




వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 26: డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెదురుకుప్పం అంతర్గత నాణ్యతా హామీ విభాగం(ఐ క్యు ఎ సి), జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్ ) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నాడు మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు కార్యక్రమం ఘనంగా జరిగింది. వెదురుకుప్పం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్( ఏఎస్ఐ ) సుబ్రహ్మణ్యం నాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ, నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే చట్టపరమైన సమస్యలు మరియు శిక్షల గురించి ఆయన వివరంగా తెలియజేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను గురించి వివరించారు. విద్యార్థులు ఈ వ్యసనాలకు బానిసలు కాకుండా, ఆరోగ్యకరమైన జీవనం గడపాలని సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు మరియు సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఆమె వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కళాశాల యాజమాన్యం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విశేష కృషి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో మాదక ద్రవ్యాల పట్ల అవగాహన పెరిగి, వారు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు అవుతారని కళాశాల యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై స్పష్టమైన అవగాహన కలిగిందని, భవిష్యత్తులో వారు ఈ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని అందరూ ఆశాభావం వ్యక్తం చేశారు. చివరగా ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం నాయుడు మరియు హెడ్ కానిస్టేబుల్ వేలుకి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేషు,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సి. మంగళ గౌరీ,డాక్టర్ వి.ప్రభాకర్ రావు,డాక్టర్ ఏ.సీ.భరణినాథ్ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొనడం జరిగింది.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
## ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్



ఎస్ ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: జర్నలిస్టుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు బుధవారం గంగాధర నెల్లూరు నియోజకవర్గం,ఎస్ఆర్ పురం మండలం కేంద్రంలో ఏపీజేడబ్ల్యు యూనియన్ ప్రెస్ క్లబ్ ను ప్రభుత్వ విప్ గంగాధర నెల్లూర్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఉన్న మీడియా మిత్రులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని నియోజకవర్గంలో ఉన్న మీడియా మిత్రులను తాను ఎప్పుడు మీడియా మిత్రులు చూడలేదని నా సొంత అన్నదమ్ముల్లాగా చూస్తానని అదేవిధంగా ప్రెస్ క్లబ్ సొంత భవనానికి స్థలం కేటాయిస్తానని పేర్కొన్నారు.త్వరలోనే మీడియా మిత్రులకు ఇళ్ల స్థలాలను నియోజకవర్గంలో ఎంతమంది విలేకరులు ఉన్న వారికి మూడు సెంట్లు భూమిని కేటాయిస్తానని ప్రెస్ క్లబ్ కు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని బహిరంగ హామీల వర్షం కురిపించారు. మీడియా మిత్రులకు ఏ సమస్య ఉన్న తనకు వెంటనే తెలియజేస్తే పరిష్కరిస్తానని అన్నారు అంతకుముందుగా ప్రభుత్వ విప్ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ ను ఏపీడబ్ల్యూజే నాయకులు సన్మానించి, పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథం,చిత్తూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రమేష్ బాబు, సెక్రటరీ కాలేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జయప్రకాష్, ఆంధ్రజ్యోతి బ్యూరో కరీం , జిల్లా ఈసీ మెంబర్ రాజేష్, రమేష్, వెంకటేష్, నియోజకవర్గ ప్రెస్ క్లబ్ నిర్వాహకులు తిరుమల, నియోజకవర్గ మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణ దారుల పై .....
# వాల్టా ఆక్ట్ ప్రకారం చర్యలు తీసుకోండి- కార్డ్స్ సంస్థ




చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 26: మండలం లో ఎక్కడ చూసినా ప్రభుత్వ భూములను అనగా వాగులను,వంకలను ఆక్రమించుకుంటున్నారు.అలాగే గుట్టలను సైతం ఆక్రమించుకొని,చదును చేస్తున్నారు. ఇటువంటి వారి పై వాల్డా ఆక్ట్ ప్రకారం చర్యలు ఎందుకు తీసుకోలేదు.వెంటనే ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి పై వాల్డా ఆక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయగలరు.మండలం లో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో,వాటి వివరాలు గ్రామ సచివాలయాలలో తెలియ జేయాలి.అలాగే మండలం లో చాలా చోట్ల అసైన్మెంట్ భూములలు ఒకరి పేరున గల భూములు మరి ఒకరి పేరున మార్చడం జరిగింది.ఏ చట్టం ప్రకారం మార్చినారో తెల్పగలరు.అంతే కాకుండా అసైన్మెంట్ భూములను ఒకరి పేరున గలవి రద్దు పరచి,అనాధీనం చేసి ఇంకోక్కరి పేరున పట్టాలు ఇవ్వాల్సి ఉండగా ఎటువంటి నోటీసులు పట్టాదారు కు ఇవ్వకుండా రద్దు పరచిన భూముల పై వెంటనే చర్యలు తీసుకోవాలని సెంటర్ ఫర్ ఆక్ట్స్ అండ్ రైట్స్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు ఉత్తరాది హరిప్రసాద్ తాహశిల్దార్ ను కలసి వినతిపత్రం సమర్పించారు.

## క్రైస్తవ ప్రచారకులు ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి .....
# దోషులను కఠినంగా శిక్షించాలని: కెవిపీఎస్ డిమాండ్



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: క్రైస్తవ ప్రచారకులు ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేకపోరాటసంఘం (కెవిపీఎస్)చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరు ఈశ్వర్ డిమాండ్ చేశారు సోమవారం హైదరాబాద్కు చెందిన ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొంతమూరు-దివాన్ చెరువు వెళ్లే ఫోర్త్ బ్రిడ్జి పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కన విగత జీవిగా కనిపించారు. పక్కన ఆయన బుల్లెట్ వాహనం ఉంది. విజయవాడ నుంచి రాజమహేంద్రవరానికి తన బుల్లెట్పై వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ప్రజలకు పలు అనుమానాలు ఉన్నాయి వేలాదిమంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ముఖ్యంగా ప్రవీణ్ పగడాల ప్రముఖ క్రైస్తవ భోదకులుగా ఉన్నారు కొంతమంది మతోన్మాదులు ఈయనపై పగతో ఉన్నారు తనకు ప్రాణహాని ఉందని గతంలో జరిగిన ఘటన లు బట్టి ఆయన అనుమానం కొద్దిరోజులు క్రితమే వ్యక్తం చేశారు దీనిపై బలమైన ఆధారాలు ఉన్నందువల్ల ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నూరు ఈశ్వర్ డిమాండ్ చేశారు.

## టిటిడి బోర్డు మెంబర్ బిజెపి లీడర్ శ్రీభాను ప్రకాష్ రెడ్డి ని....
# మర్యాదపూర్వకంగా కలసిన టిడిపి నాయకులు



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 26: గ్రామ ప్రజలకు విన్నపము బుధవారం రోజు మన గ్రామ పెద్దలు మన రాములు వారి గుడి కుంభాభిషేకం విషయముగా టిటిడి బోర్డు మెంబర్ బిజెపి లీడర్ శ్రీభాను ప్రకాష్ రెడ్డి ని తిరుపతిలో వారి ఇంటి వద్ద కలవడం జరిగింది. వారికి మన గుడి కుంభాభిషేకం విషయము, మన పెరుమాళ్ళ స్వామి గుడి విషయము వివరించడం జరిగింది. వారు టిటిడి బోర్డు తరఫున మన దేవాలయాలకు వారి వల్ల అయినటువంటి సహాయాన్ని అందిస్తానని తెలియజేశారు.

## రేవంత్ కొత్త టీమ్...?

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిపోయింది. ఇంకా కొన్ని మంత్రి పదవులకు రాష్ట్రంలో అవకాశం ఉన్నా.. వివిధ కారణాలతో ఇప్పటి వరకు సాధ్యం కాలేదు. కానీ.. ఈ రోజు సీఎం రేవంత్ రెడ్డి హుటాహుటిన దిల్లీకి పయనమయ్యి వెళ్లారు. ఆయన దిల్లీ టూర్ వెనుక కొత్త మంత్రుల ఎంపిక నిర్ణయం ఉందంటున్నారు విశ్వసనీయ వర్గాలు. తెలంగాణ పీసీసీ, ప్రత్యేక పార్టీ బాధ్యుల నుంచి అనేక మార్లు వివరాలు తెప్పించుకున్న పార్టీ కేంద్ర కమిటీ.. ఎట్టకేలకు తెలంగాణలో పెండింగ్ లోని మంత్రుల పదవుల్ని భర్తీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే.. సీఎం దిల్లీ పయనమవ్వగా.. నూతనంగా క్యాబినేట్ లోని ఆరుగురు కొత్తవారికి చోటు కల్పించనున్నట్లు తెలుస్తోంది.భారత రాజ్యాంగం ప్రకారం, రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య అసెంబ్లీ సభ్యుల మొత్తం సంఖ్యలో 15% మించకూడదు. ఈ లెక్కన తెలంగాణ క్యాబినేట్ లో గరిష్టంగా 18 మందికి మంత్రి పదవులు ఇచ్చేందుకు వీలుంటుంది. ముఖ్యమంత్రి పదవితో సహా మరో పద్దెనిమిది మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయొచ్చు. ప్రస్తుతానికి.. తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్‌లో 12 మంది మంత్రులే ఉన్నారు. ఇంకా.. 6 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. 2023 డిసెంబర్ 7న, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఆయనతో పాటు 11 మంది మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.ఆ సంఖ్యను ఇప్పటి వరకు పెంచలేదు.అనేక దఫాలుగా రాష్ట్ర క్యాబినేట్ విస్తరణపై విస్తృతంగా చర్చలు నిర్వహించారు. అయినా.. ఇప్పటి వరకు ఈ అంశం కొలిక్కి రాలేదు. కులాలు, మహిళలు సహా అనేక పరిమితుల్ని పరిగణలోకి తీసుకుని.. పార్టీలో సమాలోచనలు చేస్తున్నారు. అలా.. పూర్తి స్థాయి సన్నదత పూర్తయ్యాక.. కొత్తగా ఆరుగురికి రేవంత్ టీమ్ లో అవకాశం కల్పించాలని పార్టీ, రాష్ట్ర, కేంద్ర కమిటీలు నిర్ణయానికి వచ్చాయి. దీంతో.. ఎవరికి మంత్రి పదవులు దక్కుతాయోననే ఉత్కంఠ నెలకొంది. కాగా.. మంత్రులుగా ప్రమాణ స్వీకరం చేయనున్న వారి పేర్లు విశ్వసనీయ వర్గాల ద్వారా వెల్లడైంది.అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని జాబితాలోని పేర్లను కుదించుకుంటూ వస్తున్నారు. అలా.. చివరికి 6 పోస్టులకు 8 మంది ఆశావాహులు పేర్లు ఖరారైయ్యాయి.మంత్రివర్గ విస్తరణలో ఆశావహుల జాబితా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా
1) గడ్డం వివేక్ వర్సెస్ ప్రేమ్ సాగర్ రావు
ఉమ్మడి నిజామాబాద్ జిల్లా
2) మదన్ మోహన్ రావు వర్సెస్ సుదర్శన్ రెడ్డి
వరంగల్ జిల్లా
3) విజయశాంతి
మెదక్ జిల్లా
4) మైనంపల్లి రోహిత్ రావు
హైదరాబాద్ జిల్లా
5) అమీర్ అలీ ఖాన్
రంగా రెడ్డి జిల్లా
6) మల్ రెడ్డి రంగా రెడ్డి వర్సెస్ రామ్మోహన్ రెడ్డి
ఉమ్మడి మహబూబ్ నగర్
7) వాకిట శ్రీహరి
ఉమ్మడి నల్లగొండ
8) కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

## కొత్త బీజేపీ అధ్యక్షుడు ఎవరు..?

హైదరాబాద్ :కేంద్ర మంత్రి, ప్రస్తుత తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిహుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. షెడ్యూలు ప్రకారం.. సికింద్రాబాద్‌లో జరిగే ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొనాల్సి ఉంది. దాన్ని రద్దు చేసుకొని మరీ ఢిల్లీకి వెళ్లారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడి నియామకం కోసం కసరత్తు జరుగుతున్న ఈ సమయంలో కిషన్ రెడ్డి ఉన్నపళంగా ఢిల్లీకి వెళ్లడం చర్చనీయాంశంగా మారిందిప్రస్తుతం తెలంగాణలో బీజేపీ దూకుడు మీద ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంతో.. కేడర్ కూడా జోష్‌లో ఉంది. అయితే.. కిషన్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ బీజేపీకి సారథ్యం వహిస్తున్నారు. అదే సమయంలో కేంద్రంలో మంత్రిగా ఉన్నారు. దీంతో రెండు బాధ్యతలు నిర్వహించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిని నియమిస్తారని ప్రచారం జరిగింది. కానీ వివిధ కారణాలతో ప్రకటన వాయిదా పడుతూ వస్తోంది.కమలం పార్టీ పెద్దలు.. కొత్త అధ్యక్షుడి ఎంపిక విషయంలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రాంతాలు, సామాజిక సమీకరణాలు వంటి అంశాలను లెక్కలోకి తీసుకుందని సమాచారం. నేతలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్లే విధంగా ఉండే నాయకుడికి అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.రాష్ట్ర అధ్యక్షుడి రేసులో చాలామంది నేతలు ఉన్నారు. ముఖ్యంగా డీకే అరుణ, ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరే కాకుండా.. రఘునందన్ రావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కూడా అధ్యక్ష పగ్గాల కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికల పరిశీలకురాలుగా ఉన్న శోభా కరంద్లాజే ఇప్పటికే నేతల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఆ నివేదికను బీజేపీ పెద్దలకు అందించినట్టు సమాచారం.ఈసారి బీసీ నేతకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీల గురించి పెద్ద చర్చే జరుగుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా బీసీలను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కాంగ్రెస్ బీసీ నేతకు పీసీసీ పగ్గాలు అప్పగించింది. దీంతో బీజేపీ కూడా బీసీ కార్డుపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.ఉగాది లోపే కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించే అవకాశం ఉందని.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎలక్షన్స్ కూడా సమీపిస్తున్నాయి కాబట్టి.. వీలైనంత త్వరగా కొత్త సారథిని ప్రకటిస్తారని వివరించారు. అటు కిషన్ రెడ్డి సెడెన్‌గా ఢీల్లీ వెళ్లటంతో ఇక ప్రకటన దాదాపు ఖాయమైందని తెలుస్తోంది. అయితే.. పార్లమెంట్ సమావేశాల కోసమే కిషన్ రెడ్డి ఢిల్లీ వెళ్లారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

## 80 కోట్లకు చేరిన కోకాపేట విలువ

హైదరాబాద్ : హైదరాబాద్ నేలకు విలువ.. కుంచములతో బంగారం కొలువ' అంటారు తెలంగాణ పెద్దలు. ఇది అక్షరాల నిజం అవుతోంది. భాగ్యనగరంలోని కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ బంగారం కంటే ఎక్కువగా ఉంది. ముఖ్యంగా వెస్టర్న్ హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి.హైదరాబాద్ అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు, పెట్టుబడులు, కంపెనీల స్థాపనల కారణంగా భాగ్యనగరం ప్రపంచపటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇక్కడి పాలకులు కూడా మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాయి. ఫలితంగా మన భాగ్యనగరం భూములు బంగారం అయ్యాయి.ప్రస్తుతం హైదరాబాద్ అంతర్జాతీయ నగరాలతో పోటీపడుతోంది. ఈ క్రమంలో శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకోని ఉన్న కోకాపేట, గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్ రాంగూడ, నార్సింగి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036